అప్పగింతలు

[కథానిక]

శ్రీ జి. సాంబశివరావు

సుబ్రహ్మణ్యానికి కాకకాక పెళ్లి అయింది.. లేక లేక పిల్ల పుట్టింది.

పిల్ల పుట్టింది అంటే వూరికే పుట్టిందా ? తల్లిని చంపి మరీ పుట్టింది.

సుబ్రహ్మణ్యం భార్య సుందరమ్మ కాపరానికి వచ్చిన తరువాత పదిఏండ్లకుగాని కానుపురాలేదు. అటు తల్లివైపునగాని, ఇటు అత్తవైపునగాని ఇటువంటి వార్త లేదు. ఈ పదిఏండ్లకు కానుపు అంటూ రావడం అటూ, ఇటూ గూడా ఇదే ప్రథమం.

సుందరమ్మ అత్తగారు కాపరానికిరావడం, నీళ్లు పోసుకోవడం ఒక్కసారే జరిగాయి. తల్లి పిల్లపిల్లకూ రెండేసి ఏండ్ల వారడిలో పదిమందిసంతానాన్ని కన్నది. అందువల్ల సుందరమ్మ ఇంత ఆలస్యంగా నీళ్లు పోసుకోవడం అందరికీ విడ్డూరంగా కనిపించింది.

సుందరమ్మ అంత బలమైన మనిషి కాదు. కొంచెం లావుపాటిది. శరీరం దొందఅవడంచేత పైకి నిండుగా కనపడినా లోపలమాత్రం అల్పిష్టంగానే వుంటూవుండేది. కొంచెందూరం నడిస్తే ఆయాసం; కొంచెం పనిచేస్తే అలసట. అందువల్ల సుబ్రహ్మణ్యం గూడా అప్పుడప్పుడు భార్యకు పనిపాటల్లో కొంచెం సాయపడుతూ,వుండేవాడు.

కాకకాక పెళ్లికావడం, లేకలేక కడుపు రావడం, అదివరకే ప్రేమాస్పదంగా వున్న భార్య అతనికి ఇప్పుడు అంతకంటే ఎక్కువైపోయింది. ఇంట్లో పని పాటలు చేసేందుకు మనిషి, మంచినీళ్లు తెచ్చేందుకు బ్రాహ్మడు, వంటచేసేందుకు వేరే వంట మనిషి—ఇంతమందికి అతని సంపాదన ఆరోజుల్లో జీవితాన్ని గడిపింది. ఎప్పుడూ స్వంతంగానే అన్ని పనులూ చేసుకునేవాళ్లు ఇప్పుడు ఇంతమందికి ఇంట్లో కొలువు ఏర్పాటుచేయడంవల్ల వూళ్లోవాళ్లంతా అబ్బురంగా చెప్పుకున్నారు.

సుందరమ్మకు అయిదోనెల వచ్చింది. అల్లుడు పంపితే కూతురును పురిటికి తీసుకుపోదామని తల్లి వచ్చింది. అల్లుడు పంపనన్నాడు. 'మీది పల్లెటూరు, డాక్టరుసహాయం కావాలన్నా దొరకదు. కాబట్టి మీరు ఇక్కడే వుండి కూతురుకు నీళ్లుపోసి వెళ్లుదురుగాని' అని అల్లుడు అనేసరికి అత్తగారు కిం అనలేకపోయింది. ఇంటిలో ఇంకో ఆసరాగూడా చిక్కినందుకు సుబ్రహ్మణ్యం సంతోషించాడు.

నెలలు గడుస్తున్నకొద్దీ సుందరమ్మకు నీరు చూపడం ప్రారంభించింది. సుబ్రహ్మణ్యం డాక్టర్లను తీసుకువచ్చి మందిప్పించాడు. కొంచెం తగ్గింది. అయినా డాక్టరు మందువాడుతూనేవుండా లన్నాడు. సుబ్రహ్మణ్యం అట్లాగే చేస్తున్నాడు.

తొమ్మిదోనెలలో కనవలసిన సుందరమ్మ పదోనెల వచ్చినా ప్రసవించకపోవడంవల్ల పుట్టేది మగపిల్లవాడేగాని ఆడపిల్ల కాదని చుట్టుపక్కల అమ్మలక్కలు జోస్యాలు చెప్పారు. ఒక మొగకాయ కాస్తే బాగుంటుందని సుబ్రహ్మణ్యానికి మనస్సులో ఎప్పుడూ వుంటూనేవుంది. భార్యతో ఏకాంతంలో వున్నప్పుడు ఒకసారి ఆమెతో అమాటే అన్నాడు. ఆమె సిగ్గులో ఇటూ అటూ చెప్పలేకపోయింది.

ఆమెకుమాత్రం తెలుసుగనుకనా చెప్పడానికి! అయినా ఆమె చెబితే సుబ్రహ్మణ్యానికి నమ్మకం.

పదో నెల ప్రవేశించినదగ్గరనుంచి సుందరమ్మ పొట్టకు నీరుపట్టడం ప్రారంభించింది. సుందరమ్మ అసలే స్థూలం. ఈపొట్టకు పట్టిన నీరుతో బోర్లించిన బానకువలె ఆమెకడుపు కనిపించింది. సుబ్రహ్మణ్యానికి గాభరా ఎక్కువైంది. మళ్లీ డాక్టర్లు వచ్చారు. ఎటూ తేల్చిచెప్పలేకపోయినారు. ఇది పట్టి నీరుపట్టడమా? జలోదరమేమన్నా పుట్టుకువస్తున్నదా? ఇది ఎటూ తెగకుండానే, సుందరమ్మకు నొప్పులు వచ్చాయి. ఒక రాత్రివేళకు ఒక స్త్రీశిశువు కల్గడం, తెల్లవారకముందే సుందరమ్మ ఇహలోకం వీడటం జరిగిపోయింది.

అప్పుడు సుబ్రహ్మణ్యం ఎంత ఏడ్చాడో ఎవరూ చెప్పలేరు. ఏడుపులోపల వున్న దుఃఖానికి కొలత అవుతుందా? దుఃఖాన్ని ఒత్తిగిల్ల చేసుకోడానికి మార్గం అయితే కావచ్చు. ఇట్లా ఒత్తిగిల్లకుండా అతనిలో ఎంతదుఃఖం బంధింపబడిపోయిందో ఆతరువాతి అతని రూపం, అతని జీవితం, అతని ప్రతిపనీ వ్యక్తం చేస్తూ వచ్చాయి.

౨

చిట్టి పుట్టిన ఆరోజున ఎట్లా వున్నాడో, సుబ్రహ్మణ్యం, చిట్టిమెట్టిన పన్నెండో ఏటగూడా అట్లాగే వున్నాడు. వచ్చిన భేదమల్లా ఒక్క వయస్సులోనే.

ఈ పన్నెండేండ్లలోనూ అతని దుఃఖం ఎంత ఒత్తిగిల్లిందీ చెప్పడం కష్టం. సుందరమ్మ పోయిన కొద్దికాలానికి అతని దుఃఖం పూర్తిగా ఒత్తిగిల్లింది అనుకున్నారుగాని, ఇవ్వాళ్ల చిట్టిపెళ్లి అంటూ నిశ్చయంకావడంతో అది ఉబికిఉబికి వస్తున్న చిహ్నాలు అంతా చూడగలిగారేగాని, ఒక ఖైదీని జైలులో వుంచినట్లు అతడు ఇంతకాలం దాన్ని తన మనస్సులో బంధించివుంచాడని ఎవరికీ తట్టింది కాదు. ఏరోజు కారోజు వచ్చి మీదపడుతూ, అతని దుఃఖంలో ఏసహస్రాంశాన్నో రూపుమాపగల్గుతోందనుకున్నారుగాని ఏరోజు మీదపడిన ఆరోజుతో అతనిలోని ఈ దుఃఖం కొత్తతలలు వేస్తున్నదని ఎవ్వరూ అనుకోలేకపోయారు. మనస్సులో కుదురు కట్టిన పాదులాగా ఆదుఃఖం అతనిలో పెరిగి సర్వమైన అతని భావజగత్తును ఆక్రమించి, లోకానికి, వుండి కూడా లేదన్నట్లు తోచింది. కాని అది అతని మనస్సులో వేళ్లు దించుకొన్నదని, శరీరంలో కాయలు కాసిందని లోకానికి తెలియవలసిన అవసరం, అగత్యం ఎక్కడ వుంది? పెళ్లికి పిలిస్తే వచ్చారు గాబట్టి ఇవ్వాళ్ల చుట్టాలందరకూ పట్టింది.

వచ్చిన చుట్టాలలో డెబ్బదిఏండ్ల వృద్ధు డొకడున్నాడు. ఆయన సుబ్రహ్మణ్యంభార్యకు మేనమామ అవుతాడు. సుబ్రహ్మణ్యాన్ని పరామర్శిస్తూ అన్నాడు గదా: “నాయనా! దుఃఖం అందరికీ వస్తుంది. దాన్ని సహించడమే మానవునిలోని ఉదాత్తతను చాటుతుంది. భగవంతుడు గీతల్లో ఏమన్నాడు? కష్టాన్ని, సుఖాన్ని సమంగా చూడమన్నాడు. నీ భార్యపోవడం ఒక కష్టం. ఒక దుఃఖం. ఇప్పుడు శుభమో అని పిల్లకు పెళ్లిచేస్తున్నావు. ఇది సుఖం. ఈ నలుసుగూడా లేకపోతే ఈ సుఖం నీకు లభ్యమయ్యేది కాదు. ఆ దుఃఖాన్ని, ఈ సుఖాన్ని భగవంతుడు నీపాల వేశాడు. దుఃఖకాలంలో దుఃఖించడం, సుఖసమయాలలో సంతోషపడటం మానవుని లక్షణం. ఇంకా ఒక మెట్టు పైకి పోయావా? నీకు దుఃఖమూ వుండదు, సుఖమూ వుండదు. ఈ రెండూ సమానమే అవుతాయి. అది సామాన్యులకు సాధ్యమైన కార్యం అయినా కాకపోయినా అందుకు ప్రయత్నించడం మంచిదే గదా! భార్యపోయిందని ఇప్పటివరకూ కుమారిలిపోతున్నావే! రేపు కూతురును అత్తవారింటికి పంపాలి. ఒక అయ్య చేతుల్లో పెట్టినతరువాత పిల్ల నీయింట్లో వుంటుందా? ఇంతకాలం గారాబంగా పెంచిన కూతురు అత్తవారింటికి పోగా వచ్చిన వియోగంతో దుఃఖాన్ని తెచ్చుకొని, పూర్వం ఉన్న దానికి ఇది జోడుకాగా జీవితాన్ని ఎందుకూ కొరగాకుండా చేసుకుంటావా?

జీవితం ఇందుకటయ్యా? దాన్ని హృదయదౌర్బల్యం అని భగవంతుడు గీతల్లో అన్నాడు. హృదయదౌర్బల్యం చెడ్డది. క్షుద్రమైంది. దాన్ని త్యజించాలి. అట్లా చేస్తేనేగాని జీవికి ఉత్తిష్ఠ వుండదు."

ఈమాటలతో సుబ్రహ్మణ్యానికి దుఃఖం మరీ పొర్లివచ్చింది. ఇంతకుపూర్వం 'అయ్యో! నాయనా! సుందరమ్మ పోయిందా?' అన్నవాళ్లేగాని ఇంత ఇదిగా వేదాంతాలు చెప్పినవాళ్లు అతనికి కనిపించ లేదు. వేదాంతాలతో దుఃఖం ఉపశమిస్తే ఎంతన్నా కావచ్చును. ఇప్పటికి ఆమెపోయి పన్నెండేళ్లయినా తన హృదయంలో దుఃఖం తొలగకుండా వున్నదే! తాను ఇటువంటి వేదాంతాలు ఎన్ని చెప్పుకోలేదు? అవి ఎందుకూ కొరగాకుండా ఎన్నిసార్లు పోలేదు?

అట్లా అని సుబ్రహ్మణ్యం దుర్బలహృదయుడు కాదు. బింకం గల మనిషి. లోపల వున్న విషయాన్ని బయటికి పొక్కనీయని మనిషి. అట్లా కాక నిత్యమూ ఏడుస్తూ కూర్చునేవాడైతే చిట్టిని ఇంతదాన్ని ఏలా చేయగలిగేవాడు? చిట్టికోసం అతను దుఃఖాన్ని మ్రింగాడు. లోపల అణుచుకున్నాడు. అందువల్ల చిట్టికి, తన తండ్రి తాను ఎరుగని తన తల్లికోసం ఇంత ఇదైపోతున్నాడని తెలియదు. నిజానికి తెలియ వలసిన అవసరంగూడా లేదు.

చిట్టికి ఇప్పుడు పన్నెండేండ్లు. అరవిచ్చిన గులాబిపువ్వులా ఆమె బాల్యానికీ, యౌవనదశాప్రాదు ర్భావానికీ నడిమిదైన కాలంలో వుంది. తండ్రి చేసిన గారాబం, అమ్మమ్మపెట్టిన ఒద్దిక ఆమెలో గంగా యమునానదులకువలె ఒకటైగూడా ఒకటికాకుండా ప్రవహిస్తూ సర్వమైన ఆమెభావప్రపంచానికి హద్దులు దిద్దుతున్నాయి. ఏవిషయంలోనైనా ఒక పట్టుదల, అట్లా పట్టుబడితే బాగుండదేమో నన్న ఒక భావం, అందువల్ల పదిమందిచేత 'చూడమ్మా! తల్లి లేక పోయినా పిల్ల ఎంత ఒద్దికతో, ఎంత నేర్పుతో మెలగుతున్నదో' అని అనిపించుకోగల నిర్దాతనం ఆమెకు అలవడ్డాయి. గారాబం చేస్తే అది తండ్రిదగ్గరేగాని, ఇతరులదగ్గర చేస్తే వెగ్గుకురావడం కష్టమున్న విషయం ఆమెకు పసిపిల్లనాడే, మనస్సు ఇంకా పరిపక్వం కాకముందే, ఇది ఇది, అది అది అని తెలుసుకోజాలని స్థితిలోనే పట్టింది. తల్లి చనిపోయిన పిల్లలకు అట్లా తెలుస్తుంది. ఎట్లా తెలుస్తుందో చెప్పడం కష్టం! అట్లాగే ఆమెకు అది తెలిసింది.

వచ్చిన చుట్టాలు పిల్లలోని ఈ నిర్దాతనానికి సంతోషించారు. "తల్లి లేకపోతేనేమమ్మా! తల్లి కన్నా ఎక్కువగా పెంచే తండ్రి వుండగా! పిల్లను చూడండి, ఎంత మర్యాద! ఎంత నెమ్మదితనం!"అని అంతా అన్నారు. "ఔను! సుందరమ్మే మంచిది. సుబ్రహ్మణ్యం సరేసరి. తల్లిదండ్రుల చాలు తప్ప పిల్లకు వేరే చాలు వస్తుందా" అన్నారు. ఇంత నలుసును కని, అది పెద్దదై, పెళ్లికూతురైననాడు చూచే భాగ్యం సుందరమ్మకు లేనందుకు విచారించారు. అది వుంటే ఎంత బాగుండేది అన్న భావం వారి అందరి లోనూ వుంది.

—"నాయనా! సుబ్రహ్మణ్యం! పిల్లను పెంచి పెద్దచేశావు. ఒక మంచి అయ్యను చూచి ఆయనచేతిలో పెడుతున్నావు. బాగానే వుంది. కాని ఆ సుందరమ్మకూడా వుండి మూడుముళ్లూ పడటం చూడగల్గితే ఇంకా ఎంత బాగుండేది—"అని చుట్టాలలో ఒకావిడ అన్నది.

సుబ్రహ్మణ్యం ఏమీ మాట్లాడలేదు. కాని అతని ముఖంలో ఆమె లేని లోపం దైన్యంలాగా వ్రేళ్లాడుతూనేవుంది.

—"ఒసే! అట్లా అనకు. అది లేని లోటు ఎట్లాగూ వుండనేవుంది. అది తెలియని విషయమై తేనా! అయినా వాడి దగ్గరే అట్లా అని మరీ ఇది చెయ్యకు. మా నాయన కష్టపడి తల్లిలేని లోటు కన పడనీకుండా పిల్లను పెంచుకొన్నాడు. అట్లాగే ఆ పిల్లను ఒకళ్ల చేతుల్లో పెట్టనియ్యి—"అని అన్నది ఇంకొక వృద్ధురాలు.

దానికీ సుబ్రహ్మణ్యం ఏమీ అనలేదు. దైన్యం ముఖంలో గాఢమైన రేఖలను తీర్చింది.

—"ఔనుగాని, నాయనా! నీతమ్ముళ్లూ వాళ్లూగూడా వచ్చినట్టున్నారు. పీటలమీద వాళ్లను కూర్చోపెట్టి పెళ్లి కానిస్తావా? లేకపోతే రవికగుడ్డ రొంటిని పెట్టుకుని నీవే కానిస్తావా? పాపం! సుందరమ్మేగనక వుంటే ఈకష్టం ఎందుకు వచ్చేది—"అని కంటనీరు పెట్టుకొని ఎడమచేయి అలవాటుపడినదానికి వలె ముక్కుదగ్గరకు పోగా వ్యవహర్తను అనుకుంటూ వుండే ఒక నడివయసు వచ్చిన ఆవిడ అన్నది.

సుబ్రహ్మణ్యం ఏమీ అనలేదుగాని ఉత్తరీయపు కొంగుతో కళ్లు తుడుచుకొన్నాడు.

ఆదారినే పోతూవున్న సుందరమ్మ మేనమామ ఇది చూచి, "ఏమిటే! ఆడమూక అంతా ఇక్కడ చేరి వాణ్ణి గగ్గోలుపెడుతున్నట్లున్నారు. ఈమూక ఎక్కడ చేరితే అక్కడ ఇంతే. ప్రతిదీ తమకే కావాలన్నట్లు ప్రవర్తిస్తారు. చూడు నాయనా! సుబ్రహ్మణ్యం! పెళ్లివారు వచ్చారు. చెరువుగట్టుకు పానకం బిందెలు పంపాలిగాని, రా పోదాం!" అని రెక్క పుచ్చుకొని సుబ్రహ్మణ్యాన్ని తీసుకుపోయాడు.

3

కన్యాదానంవల్ల వచ్చే పుణ్యాన్ని ఏతండ్రీ తనకు దక్కకుండా ఇంకొకళ్ల పరం కానీయడు. అందువల్ల సుబ్రహ్మణ్యమే భార్యకు చిహ్నంగా ఒక రవికగుడ్డ చేత్తో పుచ్చుకొని చిట్టిని ఒక అయ్యచేతిలో పెట్టివేశాడు. పెళ్లి అని అనుకున్నదిమొదలు సుందరమ్మ అతనికి సాక్షాత్కారంగా కనిపిస్తూనేవున్నది. ప్రతిపనీ ఆమె పురమాయిస్తున్నది. ప్రతిదీ ఆమె దగ్గరవుండి చేయిస్తున్నది. పిల్లకు ఈరకం పరికిణీ, ఈ రకం చొక్కా కుట్టిస్తే బాగుంటుందని చెబుతున్నది. అతని మనస్సుకు ప్రతివిషయంలో అట్లా అనిపించి అట్లా చేస్తూవచ్చాడు. ఇది తన మనస్సు కల్పించుకుంటున్న సృష్టే అయినా, అతనికిమాత్రం యథార్థంగా గోచరిస్తూ ముందుకు తీసుకుపోతున్నది. నిజానికి చేత్తో రవికగుడ్డ పుచ్చుకొని కన్యాదానం చేస్తున్నాడేగాని తన భార్య తన ప్రక్కన నిలబడివుండి తనతోపాటు ఆ కన్యాదానంవల్ల వచ్చే పుణ్యాన్ని పంచుకుంటున్నట్లే అతడు భావించాడు.

—"బాబాయిగారూ! ఈ శుభసమయం అంతటా అది నాతో వున్నట్లే వున్నదిసుమండీ?" అని సుందరమ్మ మేనమామతో, పెళ్లి చాలాభాగం అయి, ఇంక అప్పగింతలు జరుగుతాయనగా సుబ్రహ్మణ్యం అన్నాడు.

—"అవును నాయనా! అట్లాగే వుంటుంది. నీకు, దానికి అంత దృఢబంధమే లేకపోతే ఇంకో పెళ్లి చేసుకునేవుండేవాడివి. ఏదో మనం అంతా పాతకాలపు మనుష్యులం, అట్లాగే అనుకుంటాం. ఏదోలే! ఆ కాస్తనలుసును వదిలిపోయింది, కాబట్టి దానికీ ఆ కాస్తపుణ్యంలో పాలున్నూ లభించింది" అని ఆయన అన్నాడు.

—"ఇందులో పుణ్యమేముంది తాతయ్యా! పిల్లకు పెళ్లిఈడు వచ్చింది. పెళ్లి చేస్తున్నారు. పుణ్యమేమిటి? పంచుకోవడమేమిటి? అందులోనూ ఎప్పుడో చచ్చిపోయిన ఆవిడకూడానా!—" అని సంగతిసందర్భం తెలియని ఆయనమనుమడు—కొత్తగా కాలేజీపరీక్ష ఇచ్చిన కుఱ్ఱవాడు అన్నాడు.

—"ఒరేయ్! ఈకాలపువాళ్లకు మేమేమీ చెప్పలేం. పాతకాలపు వాళ్లం మేమట్లాగే అనుకుంటాం. ఒక కానీ దానంచేస్తేనే పుణ్యం వస్తున్నదే? అందులో ఒక పిల్లను, కన్నదాన్ని, ఇన్నిఏండ్లు పెంచి, ఒకళ్ల చేతుల్లో పెట్టడం అంటే తక్కువవిషయమా! అయినా మీ ఆలోచనలు వేరు, మాఆలోచనలు వేరు—"అని ఆయన అన్నాడు.

మగపెళ్లివారి పురోహితుడు వచ్చి అంపకాల విషయమై తొందరచేస్తున్నాడు. పెళ్లిపెత్తనానికి పూనుకున్న సుబ్రహ్మణ్యంతమ్ముళ్లూ, బావమరదులూ అతని పురమాయింపులకు తలఒగ్గి ఏమిచెబితే అది అల్లా నెరవేరుస్తున్నారు. పెండ్లికుమారునికి, అతనితండ్రికి, తల్లికి, అన్నలకు, వదినెలకు, అక్కలకు, బావలకు, పినతండ్రులకు, పినతల్లులకు, మేనత్తలకు, మేనమామలకు

వరుసగా పీటలువేశారు. ఇంకా ఎవరికన్నా పీటలు వేయాలేమోనని సుబ్రహ్మణ్యంబావమరది గ్రుచ్చిగ్రుచ్చి అడిగి, వారితరఫున వచ్చిన దూరపుబంధువు—ఒక పూర్వసువాసిని—ఆమెకుగూడా ఒకపీటవేయించాడు. ఇంట్లో ఆడవాళ్ళు బియ్యము, పెసరపప్పు ఒక కొల్లాయి గుడ్డలో పోసి, అందులో ఒక కందపిలక వేసి వడి గంటిబియ్యం మూటగా కడుతున్నారు. పురోహితుడు బయటనే వుండి, అందులో ఒకరూపాయిగూడా వేసి కట్టాలని కేకవేశాడు. మూట పెద్దదయితే పిల్ల మొయ్యలేదు; కొంచెం చిన్నదిగా వుండేటట్టు కట్టండని ఇంకొకరెవరో పురమాయించారు.

సావడిలో ఒక మూల కూర్చున్న మంగలివాళ్లు "పోయి రాగదమ్మ! జానకీ!" అన్న పాటను దీనాతిదీనంగా సొన్నాయిమీద పలికిస్తున్నారు.

పెండ్లివారంతా ఒకరి తరువాత ఒకరు వరుసగా వేసిన పీటలమీద తమ తమ నియమితస్థానాల్లో కూర్చున్నారు. ఇంక పిల్లను తీసుకురావడమే తరువాయి. పురోహితుడు మళ్లీ నోరుచేసుకొని, తెల్లవారకముందే పెళ్లివారు ప్రయాణం కావలసివున్నదనీ, అట్లా అయితేనే గృహప్రవేశలగ్నానికి అందుకోవడం సాధ్యమవుతుందనీ, అందువల్ల పిల్లను తీసుకురావడంలో ఆలస్యం చెయ్యకూడదనీ కేకలువేశాడు. నడుమున కట్టిన వడిగంటి బియ్యపుమూటతో, ముఖమున దిద్దిన కళ్యాణపు బొట్టుతో, రాత్రి అంతా నిద్దర లేకపోవడంచేత కన్నులు ఎఱ్ఱబడగా, కనురెప్పలు అరమోడ్పు కాగా కొత్తచెలువము తెచ్చుకొన్న మొగముతో, సీతను అనుసరించిన జనకరాజుకువలె సుబ్రహ్మణ్యం ఆమెను అనుసరించి రాగా చిట్టిని తీసుకువచ్చారు.

సుబ్రహ్మణ్యంకళ్లలో నీళ్ళు గిర్రున తిరిగాయి. రొండిని గుడ్డపెట్టుకొని కన్యాదానం చేసినప్పటికన్నా అతని దుఃఖం ఇప్పుడు తీవ్రతరమైంది. ఎందుచేతనో తాను చెప్పలేడు. ఇది తన పేగు. దాన్ని ఇంకొకళ్ల మెళ్ళో వేశాడు. అందుకు ఎందుకు విచారం? అయినా అతనికి దుఃఖం ఆగింది కాదు. పసుపుపళ్లెములో చేతులు ముంచి, పేరుపేరునా అందరికీ ఆమెను అప్పగిస్తున్నాడు. ఇది మీకోడలు, దీన్ని సరిగ్గా చూడండి అంటున్నాడు. ఇది నీభార్య, నీయిష్టం వచ్చినట్లు చూడు అన్నాడు. తాను కన్న ఈ కూతునలుసు, ఒకళ్ళ చేతుల్లో పెట్టగానే తనది కాకుండా అయిపోతున్నది. ఒక చేయినరికితే అది కొంతకాలం బాధపెట్టి తరువాత నయమైపోతుంది. ఇది అట్లా కాదు. తాను కని పెంచిన కూతును, దానిమీద సర్వాధికారాలూ నీవి, నాకేమీ ప్రమేయం లేదు అని ఒకళ్ల చేతుల్లో పెట్టడం! ఎప్పుడూ ఇంట్లో 'నాన్నా! నాన్నా!' అంటూ తిరిగే ఒక పసికూనకు ఇది తన ఇల్లు అనిచెప్పుకునే అధికారం లేకుండాచేయడం! చిట్టి అత్తవారింటికి పోతుంది. తాను వెళ్ళి తీసుకవస్తాడు. అప్పుడు ఈఇల్లు తనదంటుందా! ఇది మానాన్నగారి ఇల్లంటుంది. నేను మాయింటికి పోతానని అత్తవారింటిని పేర్కొంటుంది. ఇది పైకి మాటల్లో కనుపించే విషయం. కాని హృదయదఘ్నంగా వున్న ప్రేముడి విషయమైనసంబంధం విచిత్రమైంది. కని, పెంచి, పెద్దదాన్ని చేసిన ఆ మమకారం చంపుకోవడం మహాకష్టం. అది కబుర్లవంటిది కాదు. కబుర్లు చెప్పడం తేలిక. ఈ మమకారాన్ని చంపుకోవడం కష్టం. అందులోను తల్లి లేని పిల్లను, తానే తల్లియై, తండ్రియై పెంచిన సుబ్రహ్మణ్యానికి దుఃఖం ఒకదానికొకడు ఆమ్రేడితమై దాన్ని మూడింతలు చేసింది.

'ఇప్పుడే అది వుంటే' అని అతడు అనుకున్నాడు. ఒక వ్యక్తికి దుఃఖంవస్తుంది, సుఖం వస్తుంది. ఆదుఃఖాన్ని పంచుకునేవాళ్లు వున్నప్పుడే దాని తీవ్రత తగ్గినట్లనిపిస్తుంది; ఆ సుఖాన్ని పంచుకునేవాళ్లు వున్నప్పుడే అది రాణిస్తుంది. ఇది దుఃఖం కాని దుఃఖం! సుఖం కాని సుఖం! సుందరమ్మ గనక వుంటే, ఇదమిత్థం కాని ఈ సుఖదుఃఖస్వరూపాన్ని తనకు విడమరచి అర్థమయ్యేటట్లు చెప్పివుండేది. సుబ్రహ్మణ్యానికి సుందరమ్మలేని లోటు ఇప్పుడు కనుపించినంతగా ఇంకొకప్పుడు కనుపించలేదు. అందువల్ల అతని దుఃఖం తీవ్రమై, పేరుపేరునా, చిట్టిని, అత్తవారికి అప్పగిస్తూ, అప్పగిస్తూ, ఒక్కసారి బావురుమన్నాడు. వచ్చిన అటుచుట్టాలకూ

ఇటుచుట్టాలకూగూడా కళ్ల నీళ్లు వచ్చాయి. అంతే, ఏమి లాభం? సుందరమ్మను ఎవరూ తీసుకురాలేరు. అతని దుఃఖాన్ని పంచుకోనూ లేరు.

౪

మూడునిద్దురలై చిట్టి ఇంకా రాలేదు. సుబ్రహ్మణ్యానికి ఇంట్లో ఎంత మంది చుట్టాలు వున్నా, వంటరితనం అనుభవిస్తున్నట్లే వుంది. ఇంత మంది చుట్టాలు వుండిగూడా, చిట్టి లేకపోవడంచేత అతనికి ఇల్లు బావురుమంటూవున్నట్లు వుంది. చిట్టి లేని ఈ వెలితిని అనుభవించి, తనకు మల్లే బాధపడే జీవి ఈ లోకంలో తనకు లేకుండాపోవడంగూడా అతని ఈఒంటరితనాన్ని మరీ ఎక్కువచేసింది. సుందరమ్మే వుంటే ఇందులో సగం వంటరితనాన్నన్నా పంచుకొనివుండేది.

ఈస్థితిలో సుబ్రహ్మణ్యానికి విచిత్రమైన భావం ఒకటి తోచింది. లగ్నంవేళ, కన్యాదానం చేస్తూన్నప్పుడు, తన ప్రక్కన సుందరమ్మ వున్నట్లు భావించిన తాను ఇప్పుడు భావించలేకపోతున్నాడు. అప్పగింతల సమయంలోగూడా ఆమె లేని లోటు తనకు బాగా కనిపించింది. ఈవిచిత్రమనఃపరిణామానికి కారణం ఏమైవుంటుంది? అతడు ఇందుకు ఇదీ కారణం అని చెప్పలేకపోయాడు.

చిట్టిని నిన్న అత్తవారు మూడునిద్దురలకు తీసుకుపోయారు. ఇంకా రెండురోజులు గడిస్తేనేగాని రాదు. ఒక్కరోజున ఆమె తన దగ్గర లేకపోవడమే ఇంత బాధగా వుండే, ఆమె ఇంకొన్నాళ్లకు అత్తవారింటికి పోతుంది; తన బాధ అప్పుడేమౌతుంది! తాను ఆమెను అత్తవారింటికి పంపకుండా వూరుకుంటాడా?

సుందరమ్మ కాపరానికి వచ్చిన కొత్తలో ఒక పండుగ రాగా తన బావమరిది వచ్చి చెల్లెలిని తీసుకుపోతా నన్నాడు. తాను వల్లకాదన్నాడు. భార్యను విడిచి తాను వుండలేడు. తానుగూడా అత్తవారింటికి పోదామంటే సెలవు దొరికింది కాదు. బావమరది బ్రతిమాలి, బామాలి, చెల్లెలిని తీసుకుపోయాడు. పండుగ వెళ్లిన మరునాడే తాను తన భార్యను తీసుకురావలసిందని ఉత్తరం వ్రాశాడు. బావమరది గజగజలాడుకుంటూ వచ్చి సుందరమ్మను దింపిపోయాడు.

చిట్టి విషయమూ అంతే. అల్లుడు వచ్చి కూతురును తీసుకుపోతా నంటే కాదనే అధికారం తనకు ఎక్కడిది?

సుబ్రహ్మణ్యం ఆలోచనలో పడ్డాడు. చిట్టి వస్తుంది. నాలుగురోజులు వుంటుంది. తిరిగి అత్తవారింటికి పోతుంది. అప్పుడు తా నేమి చేస్తాడు? సుందరమ్మ పదిసంవత్సరాలు తన సహధర్మిణిగా వుండి తన జీవితాన్ని వెన్నెలబాటల్లో నడిపింది. పోయింది. తాను ఏమి చేశాడు? ఆమె లేనితనంవల్ల వచ్చిన దుఃఖాన్ని ఇంతకాలంగా దాచుకున్నాడు. ఎందుకు దాచుకున్నాడు? చిట్టి అగడైపోతుందని దాచుకున్నాడు. చిట్టిగూడా అత్తవారింటికి పోతున్నది. ఇప్పుడు తాను ఏమిచేయగలడు?

దుఃఖానికి ఒక హద్దు వుంది. కష్టానికీ ఒక హద్దు వుంది. సుఖానికీ అంతే. ఆ హద్దుదాకా వచ్చేదాకానే ఆ దుఃఖంయొక్క తీవ్రత, ఆ కష్టంయొక్క వికటచంక్రమణం, ఆసుఖంయొక్క విలాసం. ఆతరువాత ఒక విరాగం తోస్తుంది. ఒక తెంపు వస్తుంది. అప్పుడు ఆ దుఃఖంతో, ఆ సుఖంతో, ఆ కష్టంతో సర్దుకుపోవడం సాధ్యమౌతుంది. కాని ఆహద్దు ఎప్పుడు వస్తుందో! ఏక్షణంలో వస్తుందో!

చిట్టి వెళ్లిన రెండవరోజున సుబ్రహ్మణ్యం మనస్సు నిద్రలోంచి మేల్కొన్నట్లు మేల్కొన్నది. మబ్బుతెర తొలగిన సూర్యుడు ఎంత వేడిగా, కరుకుగా ప్రకాశిస్తాడో అతని మనస్సు అంత చురుకుగా పనిచేసింది. ఒక్కసారిగా తనకు డెబ్బయిఏండ్ల సుందరమ్మ మేనమామ ఆరోజున చెప్పిన మాటలలోని అర్థం సువ్యక్తంకాజొచ్చింది. దుఃఖం ఏమిటి? సుఖం ఏమిటి? ఇవి మనము మనకై తెచ్చుకొన్నవి. ఇది సుఖం అనుకుంటే సుఖం, దుఃఖం అనుకుంటే దుఃఖం! ఏమి అనుకోకపోతే! సుందరమ్మ తన భార్య. చనిపోయింది. తనకు దుఃఖం. పోతూవున్న సుందరమ్మకు భర్తగుష్ఠు వుందా? ఉందని అనుకున్నా బ్రతక

గలిగిందా ? ఈ దుఃఖాలకు, ఈ సుఖాలకు మరణాన్ని ఒక హద్దుగా దిద్దిన ఏశక్తి వుందో, అది మహీయమైనది అయివుండాలి.

చిట్టి కాపరానికి వెడుతుంది. తాను కాదనదు. చిట్టి తన ఇంటిని ఆనందమయంగా చేస్తుందన్న భావం తనలో ఇంత కాలంగా వుంది. దానికి శ్లథమన్నది లేదనుకోవడం తాను కల్పించుకున్న భావం కాకపోతే మరేమిటి ? మరణంతో వస్తుందనుకున్న హద్దు అంతకు ముందుగూడా రావచ్చు. నిజంగా వచ్చింది. జీవితంలో అనుభూతి విషయకమైన ప్రతి చిన్న విషయాన్నీ మనుష్యుడు పాటిస్తే, నిజంగా తాను పడుతున్నా ననుకుంటున్న యాతనలు ఏమీ పడనక్కరలేదు. ప్రపంచం ఒక బడి. జీవితం ఒక పుస్తకం. ప్రతి అనుభవమూ ఒక పాఠం. బడిలో పడి, జ్ఞానం అంటూ వచ్చిన దగ్గరనుంచీ ఈ ప్రతిపాఠాన్నీ జాగ్రత్తగా చదివి దానివల్ల వచ్చే గుణపాఠాన్ని తనకు తాను ముక్తంచేసుకోగల ఏ వ్యక్తికయినా దుఃఖమూ, సుఖమూ, కష్టమూ ఒకటే అవుతాయి.

ఈ మూడురోజులుగా సుబ్రహ్మణ్యంమనస్సులో రేగిన తుపాను ఇప్పుడు విరిసిపోయింది. మూడు నిద్దరలు అయి, చిట్టి, భర్తతో సహా పుట్టింటికి వచ్చింది. సుబ్రహ్మణ్యం సంతోషించాడు. ఆ సంతోషంలో ఒక నిర్లిప్తత వుంది.

చిట్టి తండ్రిదగ్గరకు వచ్చింది. తండ్రి ఆమె చుబుకము గిల్లి 'చిట్టీ! మీ ఇల్లు బాగున్నదా!' అన్నాడు. చిట్టి చేసిన ఒక మధురమందహాసరేఖ ముమ్మరంగా తోచిన నునుసిగ్గుదొంతరలను చీల్చుకొని బయటకు వచ్చింది.

ప్రేమగీతి

శ్రీ స్థానాపతి రుక్మిణమ్మ

చక్కదనమునె ప్రేమింపజాలుదేని
వలదు ప్రేమింప ; దశదిశల్ వెలుగజేసి
ఆదిమధ్యాంతములు లేని అధికదీప్తి
చక్కనౌ కాంతి ప్రేమింప జనును నీకు.

తరుణి నంచును ప్రేమింప దలతువేని
వలదు ప్రేమింప ; సర్వదా తలుసమూర్తి
నవనవోన్మేషరీతుల నాట్యమాడు
మాధవుని నీవు ప్రేమింప మంచిదగును.

ధనముకోసమె ప్రేమింప దలచితేని
వలదు ప్రేమింప ; నుడువగా నలవిగాని
రత్నరాసుల వెలుగొంది రహి దనర్చు
నుదధి నెప్పుడు ప్రేమింప నొప్పు నీకు.

ప్రేమకై నన్ను ప్రేమింప బేర్మి దలతె
ప్రేమమున్ గొల్పరావోయి ప్రియవయస్య !
ఇనుడు, మాధవు, డుదధి యిన్నింటికంటె
నమ్మకమ్మగు నాడు మనమ్ము నిడుదు.